క్లుప్తంగా

నవరత్నమాల హారతి అద్భుతం

కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాల్లో నిర్వహిస్తున్న నవరత్నమాల హారతి అద్భుతమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుష్కరాల పవిత్రతను, మహాత్యాన్ని వివరించేందుకు ప్రతి రోజు కాశీ పండితులతో ఘనంగా సరస్వతి నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాలను విజయవంతంగా నిర్వహిస్తున్న అధికారులను అభినందించారు. సరస్వతి పుష్కరాలు మే 26 వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు.

ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించిన జేడీ



భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి గురువారం పరిశీలించారు. రేగొండ మండలం రంగయ్యపల్లి, భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలలోని శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేయాలని, ఉపాధ్యాయులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జేడీ సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్, కోఆర్డినేటర్లు లక్ష్మణ్, రమేష్, రాజగోపాల్, ఎంఈఓలు ప్రభాకర్, దేవా పాల్గొన్నారు.

విరాళం అందజేత

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన ప్రసాద వితరణ కోసం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రూ.పదివేలను అందజేశారు. ఈ నగదును నాయకుల ద్వారా గురువారం పంపించినట్లు తాడూరి రఘు, గడదాసు సునీల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మ మల్లారెడ్డి, గండెపల్లి నర్సయ్య, శ్రీను, వీరన్న, పోశయ్య, నాగరాజు, చంద్రబాబు, బోజారావు, తిరుపతమ్మ, రాకేష్, పాపయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మరికాల గ్రామానికి చెందిన బాలసాని నాగభూషణం వెంకటాపురం మండల కేంద్రం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఆవుపల్లి గ్రామానికి చెందిన సోడి అజిత్ మరికాల గ్రామం నుంచి వెంకటాపురం ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. కాగా బెస్తగూడెం గ్రామ శివారుల్లో ఎదురు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొట్టడంతో బాలసాని నాగభూషనంకు తలకుగాయాలు కావటంతో పాటు చెయ్యి విరిగిందని, అజిత్‌కు తలకు గాయాలైయ్యాయని తెలిపారు. గమనించిన గ్రామస్తులు వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.

వర్షానికి కూలిన ఇల్లు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి శాంతిశ్రీకి చెందిన పాత ఇల్లు కూలింది. గురువారం పంచాయతీ సిబ్బంది కూలిన గోడలను తొలగించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



రేగొండ: ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని తిరుమలగిరిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన మల్యాల సదయ్య ఇల్లు విద్యుదాఘాతంతో గురువారం తెల్లవారు జామున దగ్ధమైంది. దీంతో ఘటన స్థలాన్ని తహసీల్దార్ శ్వేత సందర్శించి నష్టాన్ని ప్రాథమిక అంచనా వేశారు. ఆమె వెంట ఆర్ఐ భరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతు వేదికలకు నిలిచిన నిధులు

వ్యవసాయ అధికారులపైనే నిర్వహణ భారం

● పేరుకుపోయిన బకాయిలు



పాత్రాపురం రైతు వేదిక

వెంకటాపురం(కె): పంటల సాగులో రైతులకు సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. మండలంలో 19 పంచాయతీలు ఉండగా ఆలుబాక, మరికాల, పాత్రాపురం పంచాయతీల్లో రైతు వేదికలను నిర్మించారు. నిర్మించిన రైతు వేదికల నిర్వహణ వ్యవసాయ అధికారులకు భారంగా మారింది. ప్రతీ వారం రైతు నేస్తం కార్యక్రమాల నిర్వహణతోపాటు పంటల సాగులో మెలుకువల కోసం ఏర్పాటు చేసే అవగాహన సదస్సులు, పలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు, రైతులకు చేరవేసేందుకు నిర్వహించే భారమంత వ్యవసాయ శాఖ అధికారులపైనే పడుతోంది. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణ కోసం విడుదల చేసే నిధులను విడుదల చేయక పోవటంతో ఏఈఓలే సొంత డబ్బులు ఖర్చు పెట్టి క్యాక్రమాలు నిర్వహించాల్సి వస్తోంది.

భారంగా నిర్వహణ

రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేలు విడుదల చేసేంది. గత కొంత కాలంగా నిధులు ఆగిపోవడంతో రైతు వేదికల నిర్వహణ భారంగా మారింది. రైతు వేదికల నిర్వహణ భారం అంత ఏఈఓలే భరించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో పేరుకు పోతున్నాయి. స్వీపర్, తాగునీటి ఖర్చు తదితర ఖర్చులను భరించాల్సి వస్తుందని ఏఈఓలు వాపోతున్నారు. ఫలితంగా రైతులకోసం నిర్వహించే కార్యక్రమాలను సైతం పూర్తి స్థాయిలో చేపట్టలేక పోతున్నారు.

నిధులు రావడం లేదు



రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదు. రైతు వేదికల్లో నిర్వహించే కార్యక్రమాల నిర్వహణ భారంతో పాటు విద్యుత్, తాగునీటి బిల్లులు, స్వీపర్ ఖర్చులకు సొంతంగా చెల్లించాల్సి వస్తుంది.

– నవీన్, మండల వ్యవసాయ అధికారి

అక్రమంగా బిళ్లలు ఆడుతున్న ముఠా అరెస్ట్



అరెస్టు చూపుతున్న పోలీసులు

ములుగు: మల్లంపల్లి మండల కేంద్రంలో బిళ్లలు ఆడుతున్న ముఠాను ములుగు పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలో గురువారం అంగడిని దృష్టిలో ఉంచుకోని అంగడికి వచ్చే వారితో కొందరు ముఠాగా ఏర్పడి బిళ్లలు ఆట ఆడిస్తున్నారు. దీంతో పక్కా సమాచారంతో ములుగు ట్రెనింగ్ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించగా మరి కొందరు పారిపోయారు. పట్టుబడ్డ వారిలో బొచ్చు విజయ్ కుమార్, ఓరుగంటి రజనీకాంత్, లింగాల అనిల్ కుమార్ ఉండగా, గాజర్ల రాజు, వజ్జం రాకేష్, వజ్జం శ్రీనివాస్, వీర్ల శంకర్ పారిపోయారు అని ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి 13 వందల రుపాయలు, బిళ్లలు ఆడే చెక్క, మూడు బిళ్లలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం

● ఎస్సై ఆంజనేయులు



మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

గోవిందరావుపేట: గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పస్రా ట్రెనింగ్ ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని బుస్సాపూర్‌లో పస్రా ట్రెనింగ్ ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పడే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. లక్నవరం వచ్చే పర్యాటకుల పూర్తి వివరాలను తెలుసుకోవాలని, వారి ఆధార్ కార్డులను తనిఖీ చేయాలని అన్నారు. రోడ్ల మీద వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మైనర్ డ్రైవింగ్ చేయొద్దని తెలిపారు.

లైఫ్ జాకెట్ లేకుండానే ప్రయాణం



భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం పుష్కరాల నేపథ్యంలో త్రివేణి సంఘమంలో లైఫ్ జాకెట్ లేకుండానే కొంత మంది భక్తులు గోదావరి అవతలి వైపు పడవల్లో వెళ్లి పుష్కర స్నానాలు చేస్తున్నారు. పడవల నిర్వహకులు రక్షణ చర్యలు పాటించకుండానే గోదావరిలో పడవలు నడిపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

ప్రమాదకరంగా రోడ్డు



చిట్యాల: కాళేశ్వరంలోని బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు వెళ్లే రహదారి బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అటుగా వెళ్తున్న వాహనాలు ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు కోతకు గురైన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ



భూపాలపల్లి అర్బన్: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ సమీపంలోని లడ్డు, ప్రసాదాల కౌంటర్ల వద్ద గురువారం భక్తుల తాకిడి పెరిగింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు లడ్డులకు రూ.50, పులిహోర ప్యాకెట్ రూ.15లకు విక్రయాలు చేపడుతున్నారు. ప్రసాదాలు కొనుగోలు చేసేందుకు భక్తులు క్యూ లైన్‌లో బారులుదీరారు.

రోడ్డుకు మరమ్మతులు



చిట్యాల: కాళేశ్వరం సరస్వతి నది ప్రధాన ఘాట్ నుంచి పుష్కర ఘాటుకు వెళ్లే దారిలో భారీ వర్షానికి రోడ్డు బురదమయం అయింది. దీంతో అధికారులు బురదమయమైన రోడ్డుపై గురువారం కంకర పోసి మరమ్మతులు చేపట్టారు.



సరస్వతి పుష్కర ఘాట్ వద్ద ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

మిషన్లతో ఎంతో మేలు



పలిమెల: కరెంట్‌తో మొక్కజొన్న కంకులు కాల్చే, ఉడికించే మిషన్లు మహిళా ఔత్సాహికులకు ఎంతో మేలని మధుగురు ఇన్నోవేషన్ ఆర్గనైజర్ మధుకర్ అన్నారు. కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో మధుగురు ఇన్నోవేషన్ అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధుగురు ఇన్నోవేషన్ పరికరాలతో మహిళలు, యువత, రైతులకు ఆర్థిక సాధికారత సాధించాడికి ఎంతో మేలన్నారు. ఔత్సాహికులకు సుమారు 100 రోజుల పాటు శిక్షణ ఇచ్చి బీజినెస్ సెంటర్ల గుర్తించి వారిని ప్రోత్సాహిస్తామన్నారు.

షటిల్ బస్సుల పునరుద్ధరణ

కాటారం: పుష్కరాల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత షటిల్ సర్వీస్ బస్సులు గురువారం ఉదయం నుంచి తిరిగి నడుస్తున్నాయి. తాత్కాలిక బస్టాండ్ నుంచి సరస్వతి ఘాట్ వరకు, అక్కడి నుంచి ప్రధాన దేవాలయం వరకు భక్తులను ఉచితంగా రవాణా చేయడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. బుధవారం కురిసిన వర్షం కారణంగా బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులు భక్తులకు ఇబ్బందులు కల్గకుండా తిరిగి బస్సుల సేవలను పునరుద్ధరించార

పెట్రోల్ కష్టాలు

పలిమెల: పుష్కరాల్లో పెట్రోల్ దొరకక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరంలో పెట్రోల్ బంకు లేకపోవడంతో పలువురు దుకాణదారులు పెట్రోల్‌ను క్యాన్లలో తీసుకువచ్చి లీటర్ రూ.130 కి విక్రయిస్తు సొమ్ముచేసుకుంటున్నారు. దగ్గరలో పెట్రోల్ బంకులు లేకపోవడంపై పలువురు వాహనదారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఏటూరునాగారం: పూజలు చేస్తున్న సీఐ శ్రీనివాస్



ఏటూరునాగారం: ఓడవాడ పూజల్లో భక్తులు



వాజేడులో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో భక్తాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, పుష్పాభిషేకం పూజా కార్యక్రమాలను అర్చకులు యల్లాప్రగఢ సూర్యనారాయణ, మణికంట, రామ్మూర్తి శర్మ నిర్వహించారు. సీఐ అనుముల శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే ఆలయం వద్ద మహాన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఓడవాడలో..

మండల కేంద్రంలోని ఓడవాడలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకుడు వంగాల వీరన్న, కందగట్ల రమేశ్, సాంబశివుడు తెలిపారు. అన్నప్రసాదన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే పప్కాపురం గ్రామంలో నెలకొల్పిన అంజనేయస్వామికి పూలతో అలంకరించి పూజలు చేశారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర, సూరవీడు, ఆలుబాక, పాత్రాపురం, వీఆర్‌కెపురం, మండల కేంద్రంలోని మంగపేట రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం, శివాలయం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. శివాలయం ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆకుపూజా, సిందూర పూజ, నిర్వహించడంతో పాటు అభిషేకలు, ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయ కమిటీ సభ్యులు మదూగూరి సత్యనారాయణ, వేలపూరి లక్ష్మీనారాయణ, శివాజీ తదితరులు ఉన్నారు.



ఏటూరునాగారం: అన్నప్రసాద వితరణకు హాజరైన భక్తులు

వాజేడు: మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను మండల కేంద్రానికి చెందిన భక్త జన బృందం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి ముందుగా పాలాభిషేకం జరిపించి స్వామి వారికి శాస్త్రోక్తంగా పత్ర, ఫల, పుష్పాలతో విడివిడిగా పూజలను అర్చకులు సౌమిత్రి వేణుగోపాలా చార్యులు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలోని మహ్మద్ గౌస్ పల్లిలో సహ్యాద్రి స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. వేద పండితులచే బోనేపల్లి రఘుపతి రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): శివాలయం సమీపంలో..

'పుట్ట మధుకు మతి భ్రమించింది'

● రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐత ప్రకాశ్‌రెడ్డి, నాయకులు

కాళేశ్వరం: బీఆర్‌ఎస్ నాయకుడు పుట్ట మధుకు మతి భ్రమించిందని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి హరిత హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజబాపు, మాజీ జెడ్పీటీసీ మాజీ ఎంపీపీ బండెల సత్తమ్మ, జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మాట్లాడుతూ.. సరస్వతి నది పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటే కళ్లు చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

భారత్ విశ్వగురువులా నిలుస్తుంది

● బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్



మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

కాటారం: దేశ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారత్ విశ్వగురువులా నిలుస్తుందని మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాల సందర్భంగా ఈటల రాజేందర్ సతీమణి జమునతో కలిసి సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కరఘాట్ వద్ద మీడియాతో మాట్లాడారు. 20 ఏళ్ల క్రిందట అధికారంలో ఉన్న ప్రభుత్వాల కారణంగా దేశం కొంత వెనకబాటుకు గురైందని ఆరోపించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ నేతృత్వంలో దేశ అభ్యున్నతి, ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తుందన్నారు. దేశ రక్షణే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. పన్నేండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల్లో స్నానం ఆచరించడం మహాభాగ్యమని రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని సరస్వతి మాత, కాళేశ్వర ముక్తీశ్వరుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఎంపీ వెంట ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, నాయకులు చల్ల నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీ రాజేందర్‌కు సన్మానం

భూపాలపల్లి రూరల్: మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్ సరస్వతీ పుష్కరాలకు గురువారం కాళేశ్వరం వెళ్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కన్నం యుగదీశ్వర్, ఎరుకల గణపతి, బట్టు రవి, దొంగల రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కాటారం: మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. రఫీ ఆస్పత్రి యజమాని డాక్టర్ రఫీ, ఆయన కుటుంబ సభ్యులు, ములుగుపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి పార్టీలో చేరగా ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్ల నారాయణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రావు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించడంలో విఫలం

● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం: పన్నేండేళ్లకు ఒకసారి వచ్చే సరస్వతి నది పుష్కరాల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు,శైలజ దంపతులు గురువారం కాళేశ్వరంలోని సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం పుష్కరఘాట్ వద్ద పుట్ట మధు విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ చేతకానితనంతో పుష్కరాలు విఫలమయ్యాయని అన్నారు. పుష్కరాల్లో సరైన ఏర్పాట్లు, సౌకర్యాలు లేక భక్తులు, విధులు నిర్వర్తించడానికి వచ్చిన అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. పుష్కర స్నానానికి వచ్చిన భక్తులు, సాధువులు ప్రభుత్వ ఏర్పాట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పుష్కరాల విధులు నిర్వర్తిస్తూ వడదెబ్బతో పారిశుద్ధ్య కార్మికుడు దళితుడైన మంతెన శ్రీనివాస్ మృతి చెందితే ప్రభుత్వం, మంత్రి పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ములుగు రూరల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మల్లంపల్లి మండలం రామచంద్రాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజ్జగిరి రమేశ్ అనే రైతుకు చెందిన గేదెను ఇంటి వెనుకాల షెడ్డులో కట్టేశాడు. కాగా గురువారం సాయంత్రం వీచిన గాలికి చెట్టు విరిగి కరెంట్ వైరుపై పడడంతో వైరు తెగి గేదెపై పడింది. దీంతో షాక్‌గురై అక్కడిక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు రమేశ్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944